

# జీవితం

— గెల్లి మహేశ్వరి

బాల భానుని నులి వెచ్చని కిరణాల తాకిడికి పార్కులో బెంచి మీద పడుకున్న శీనుకు మెలకువ రావటంతోటే పక్కబెంచీ వేపు చూశాడు. వెంకు రాలేదు, యేవిటో నీరసమొచ్చినట్లయింది. శీనుకు స్నేహితుడయినా,తోబుట్టువయినా, ఆత్మీయు డయినా ఈ లోకంలో వెంకు వొక్కడే... వాడు ఈవేళ రాడు. కనీసం వాడికో అక్క, బావయినా వున్నారు. అక్కకు వాడంటే అభిమానమే కానీ వాడి బావ మాత్రం డబ్బు తీసుకువెళ్ళి ఇస్తేనే అక్కని అన్నం పెట్టనిస్తాడు. అందుకే వెంకు ప్రొద్దుట్నించీ సాయంకాలం వరకూ వేరుశనక్కాయలు, బఠాణీలు అమ్మిఆ డబ్బులు తీసుకుని అక్క ఇంటికి వెళ్తాడు.

ఈవేళేదో పండుగని వాళ్ళక్క ప్రొద్దున్నే వచ్చేయమందని రాత్రే చెప్పాడు. పండుగయినా, పబ్బమయినా తనను పిల్చేవాళ్ళెవరు? ఇలా అన్పించగానే చెప్ప లేనంత యేడుపొచ్చింది. ఆ యేడుపులో తల్లీ, తండ్రీ గుర్తుకు రావటంతోటే ఇద్దరూ వుండి కూడా తను వొంటరిగా మిగిలిపోయాడు. ఆ బాధలో ఒక్కొక్కటీ తలంపుకు వచ్చాయి.

తనుకూడా అందరు పిల్లల్లానే ఎనిమిదేళ్ళ వయసొచ్చే వరకూ తల్లిదండ్రుల చేతుల్లో ముద్దుగా పెరిగాడు. ప్రతి పండుగకూ తండ్రి కొత్త బట్టలు తెచ్చేవాడు. తల్లీ తీపి వంటకం చేసిపెట్టేది. వాళ్ళు బయటకు వెళ్తే తనని కూడా తీసుకెళ్ళేవాళ్ళు. తండ్రి గోపాలం అదేదో కంపెనీలో పనిచేసేవాడు. ప్రొద్దున తొమ్మిది గంటలకు వెళ్ళి సాయంకాలం ఐదుగంటలకు ఇంటికొచ్చేవాడు. తండ్రి కొచ్చే జీతం ఇంటి ఖర్చులకు సరిపోతుందని మిగిలేదేం వుండదని తల్లి పక్కింటి సూరమ్మ పిన్నితో చెప్తూంటే విన్నాడోసారి.

తల్లి తన కోరికలు, సరదాలు తీర్చలేక పోతున్నాడని తండ్రినెప్పుడు సాధిస్తూండేది. ఓ రోజు స్కూలు నుంచీ వచ్చేసరికి ఇంట్లో యెవరో వొకాయన కూర్చుని వున్నాడు. తల్లి ఆయనకు దగ్గరగా నిల్చుని కబుర్లు చెప్తోంది. తనని చూడగానే ఆయన 'ఓరి..... ఓరి.... దమయంతీ వీడేనటే నీ కొడుకు వీడి దుంపతెగ ముద్దుగా, బొద్దుగా బాల భీముళ్ళా వున్నాడేవిటే. వొక్కడే కొడుక్కదాని మీరిద్దరూ సగం కడుపు నింపుకుని వీడికి పొట్ట పగిలేలా పెడ్తున్నారేవిటే'' అని పగలబడి నవ్వుతూ తనను దగ్గరకు పిలిచాడు. ఆయన మాటలు, చూపులు, నవ్వు యెందుకో తనకు వెగటు పుట్టించాయి.

పైగా ఆయన మాట్లాడుతూనే మధ్య మధ్యలో తన తల్లి భుజాల మీద చరుస్తూ మాట్లాడుతుంటే వొళ్ళు మండింది తనకు. వెంటనే పుస్తకాల సంచి అక్కడ పడేసి బయటకెళ్ళిపోయాడు స్నేహితులతో ఆడుకోవటానికి. తరువాత కొంత సేపటికి తనొచ్చేసరికాయన లేడు. ఆయనెవరని తల్లి నడిగాడు, తనకు వరుసకు మేనమామని చెప్పింది.

మరో నాలుగు రోజులకు తల్లికి చీర, పళ్ళు, పూలు తెచ్చాడాయన. తల్లి మురిసిపోతూ అవన్నీ తీసుకుని దాదాపు ఆయనకానుకుని నిల్చుంది. తరువాత అప్పుడప్పుడాయన వస్తూనే వున్నాడు. వచ్చేటప్పుడు మిఠాయిలో, గాజులో తెచ్చిస్తూ, పండుగ లొస్తే చీరలు తీసుకొస్తూ నాలుగేసి రోజులుండటం మొదలు పెట్టాడు.

ఆయన వొచ్చినప్పుడు తల్లిలో మార్పు కొట్టొచ్చినట్లు కన్పించేది తనకు. తండ్రి ఇంట్లో లేని వేళల్లో తల్లి ఆయన తెచ్చిన చీరలు కట్టటం డాబా మీద ఇద్దరూ పక పకలు - ఇవన్నీ చూస్తుంటే తనకు వొంటికి కారం రాసుకున్నట్లుండేది. ఆ రోజు తండ్రి ఇంటికి రాగానే చెప్పేశాడు.

ఆ రాత్రి తండ్రి తల్లిని నిలదీశాడు. "వాడెవడు యెప్పుడూ మనింట్లో తగలడ్తాడు పొమ్మను'' అని.

"మా మేనమామని చెప్పాను కదండీ, ఎందుకట్లా విరుచుకుపడ్తారు?'' తల్లి కూడా గయ్యిమంది.

"మేనమామా..... మేకపోతా.. ఇంకోసారిక్కడ కొచ్చాడంటే కాళ్ళు విరగ్గొడతాను. మన పెళ్ళిగ్గానీ, తరువాతగానీ కనపడని మేనమామ ఇప్పుడెక్కడ్నించి వూడిపడ్డాడు వెధవ'' అంటూ తండ్రి పళ్ళు నూరాడు.

"అంతేలెండి అమ్మ పెట్టా పెట్టదు. అడుక్కుతినా నివ్వదన్నట్లుంది మీ వరస. ఏనాడయినా మంచి చీర తెచ్చారా, ఏమయినా నగలు చేయించారా... ఏ ముచ్చటా తీర్చలేనప్పుడు తను దూరటానికోకంత లేదు మెడకోడోలన్నట్లు మీకు పెళ్ళీ పెళ్ళామెందుకండీ బుద్ధిలేక'' తల్లి మాట పూర్తి కాకముందే ఆమె చెంప ఛెళ్ళు మన్పించాడు తండ్రి.

"అందుకని వాడు తెచ్చినవన్నీ సింగారించుకుని వాడితో సరసాలాడుతున్నావా? భర్తకంటే అవే యెక్కువా? అసలు నువ్వు ఆడదానివి కాదే.. ఆ రూపంలో వున్న కామ పిశాచానివి.... ఛీ.....''

"చాల్లెండి మావయ్య వొంటరిగా బ్రతకలేక తోడుకోసం అండ కోసం ఇక్కడికొచ్చాడు. ఆయనకేం తక్కువ. బోలెడాస్తి వుంది.'' ఇంకా తల్లి యేదో అనబోతుంటే.... అంటే వాడి డబ్బు కోసం వాడితో....''

"ఆపండి, నేనటువంటి దాన్ని కాదు. మీరే వాజమ్మ దద్దమ్మ....'' తల్లి అంటూండగానే....ఆయన మళ్ళీ చెయ్యెత్తబోతుంటే ఆ మేనమామ వచ్చి అమ్మ కడ్డంగా నిల్చుని "కట్టుకున్న పెళ్ళాన్నలా కొట్టొచ్చా'' ఏవో నీతులు వల్లించ బోయాడు.

"నోర్ముయ్.... మరొకడి ఇల్లాలితో కులకవచ్చా'' అని నాన్న.

"రామ, రామ దేవుళ్ళాంటి నన్ను అంత మాటంటావా...?'' ఆయననే

సరికి - నాన్న అయన వయిపు చూసి ఛీత్కరిస్తూ బయటకు వెళ్ళిపోయాడు. కానీ ఆ సిగ్గులేని ఆయన మాత్రం ఇంట్లోంచి వెళ్ళిపోలేదు. ఇలా తల్లికీ, తండ్రికీ రోజూ పోట్లాటలు, తిట్టుకోవటాలు యెక్కువయిపోయాయి. తనకి ఇంటికెళ్ళాలంటే చిరాకొచ్చేది.

ఓసాయంకాలం తను స్కూలు నుంచి వచ్చేసరికి తల్లి వాడివాళ్ళో పడు కునివుంటే వాడామె చెంపలు సవరిస్తూ ఆమె మీదకు వొంగి ఏదో అంటు న్నాడు. తల్లికూడా వాడి మీద చెయ్యేసి నవ్వుతోంది. తల్లి ప్రక్కన తండ్రిని చూస్తే యేమనిపించేది కాదు కానీ ఈ పాపిష్టి వాణ్ణి చూస్తుంటే చంపి పారె య్యాలన్పిస్తోంది.

పుస్తకాల సంచి విసురుగా వోమూలలకు గిరాటు వేశాడు. ఆ శబ్దమయినా వాళ్ళిద్దరినీ విడదీస్తుందని - వాళ్ళ లోకంలో వాళ్ళుండిపోయారు. వాళ్ళేం చెప్పుకుంటున్నారో వినాలని ఇవతల వోమూలగానక్కాడు. ఏవో శబ్దాలు, నవ్వులూ విన్పిస్తున్నాయి కానీ వాళ్ళ మాటలేం విన్పించలేదు. ఇంతలో తండ్రి వచ్చి తనవైపు చూశాడేవిటన్నట్లు - తనాగది వయిపు వేలు పెట్టి చూపించాడు.

తండ్రి లోపలికి వెళ్ళి యేం చూశాడోగానీ ఆయన కాలర్ పుచ్చుకుని గుంజేస్తూ, "అరె బద్మాష్ నిన్ను ఛంపే స్తానీవేళ" అరుస్తూ అయన్ను యెడా పెడా బాదేస్తున్నాడు. తల్లి అడ్డుపడితే ఆమెను కూడా బాదుతూ - "అసలనా ల్సింది వాణ్ణికాదే... నిన్ను నీతి జాతి లేకుండా పరాయి మగవాణ్ణి ఇంట్లో చేర్చి కులుకుతున్న నిన్ను" అంటూ ఆవేశంగా తల్లిని కొట్టబోతుంటే ఆమె-

"నీతో వుంటే యెన్నాళ్ళయినా పచ్చడి మెతుకులు చింకిపాత చీరలేగా.... అసమర్థుడివి, ఇష్టమయితే చూసీ చూడ నట్లుండి వేళకింత తిని వెళ్ళు అంతే కానీ పెత్తనం చెలాయించకు" అన్నది తండ్రి వయిపు వురిమి చూస్తూ....

"ఛూ... తెగించిన ఆడదానికి తెడ్డే లింగమే... ఈ ముసలాడితో యెన్నాళ్ళు సుఖపడ్తావో చూస్తానం"టుంటే.....

"అబ్బో.... నీతో మాలావు సుఖపడి పోతున్నాను. ప్రొద్దుననగా వెళ్ళి సాయం కాలమొచ్చి వో ముద్దు ముచ్చట లేకుండా వుస్సురంటూ వేళ్ళాడుతూ పడుంటావు" అని అమ్మ ఛీత్కరిస్తుంటే, ముస లాడు మీసాలు మెలివేస్తూ నవ్వుతూంటే నాన్న రెచ్చిపోయాడు.

"ఛీ..... నువ్వు శంఖిణీ జాతి స్త్రీవే" అమ్మ జుట్టు పట్టుకోబోతుంటే ముస లాడు అడ్డుపడి అన్నాడు.

"నీ వంటే ఇష్టంలేని ఆడదాన్నెంత కాలమని అదుపులో పెడ్తావు. అస లామె పొమ్మంటుంటే దేబిరిస్తావెందుకు? నీకింకా సిగ్గులేదూ" అన్నాడు. అమ్మ పగలబడి నవ్వుతూంటే నాన్న అవమానంతో రగిలిపోతూ విసురుగా బయటకు వెళ్ళిపోయాడు. ఆ వెళ్ళటం మళ్ళీ తిరిగి రాలేదు. ఆ రాత్రి తనొ క్కడే ఇవతలి గదిలో బిక్కు బిక్కుమంటూ వుండి పోయాడు.

తల్లికూడా తన సంగతి కానీ, తన ఆకలి సంగతికానీ పట్టించుకోలేదు. తెల్లవార్లూ వాళ్ళిద్దరి నవ్వులు వినబడ్తూనే వున్నాయి. తానా రాత్రంతా యేడు స్తూనే వున్నాడు. తెల్లవారాక కూడా తల్లి తననంత ఆప్యాయంగా చూడలేదు. దగ్గరకు పిలువలేదు. అన్నం మాత్రం పెట్టింది. తనకెందుకో రోజూలా తినా లనిపించలేదు. తల్లితో మాట్లాడకుండా స్కూలుకు వెళ్ళిపోయాడు.

తరువాతనించీ వాళ్ళిద్దరి సరదాల కడ్డులేకపోవటంతో ఇద్దరికీ షికార్లెక్కు వయిపోయాయి. తను తిన్నా తినకపోయినా పట్టించుకునే వారు కాదు. ముసలాయన కెంత డబ్బుందో గానీ రోజూ తల్లికేవేవో తెస్తూండేవాడు. కొత్త చీరలు, నగలు పెరిగిపోయాయి. తను చిరుగుల బట్టలతో వున్నా అమ్మకు పట్టలేదు. ఇరుగు పొరుగు వారంతా అమ్మను అసహ్యించుకుని దాదాపు మాట్లాడ్డం మానేశారు.

ఓసారి తను ఇంటికి వచ్చేసరికి ఇల్లు తాళం పెట్టివుంది. పక్కింటి సూరమ్మ పిన్ని -

"మీ అమ్మ వుంచుకున్న ముసలాడితో యెక్కడికో వెళ్ళింది" అని చెప్పింది. తనకేడుపొచ్చినంత పనయింది. నాన్నయితే తనని తీసుకెళ్ళకుండా వదిలేసి వెళ్ళేవాడా - ? అసలు వుంచుకోవటమంటే యేవిటీ ...?... అదే తన స్నేహితుణ్ణి అడిగాడు.

"ఒరే... శీనూ... మీ అమ్మ మీ నాన్నను వొదిలేసిందట, వాడి వళ్ళో పడి మీ నాన్నను ఇంట్లోనుంచి తరిమేసిందట, వాడితో షికార్లు కొడ్తోందిగా... అదే వుంచుకోవటమంటే" అని వాడంటుంటే చుట్టూ వున్న వాళ్ళు నవ్వేసరికి తనుకోపం పట్టలేక వాళ్ళ మీద కురికి తన్నబోయాడు.

"ఓరి నీ ముఖం ఈడ్చ - మా పిల్లల్ని కొడ్తావేం? చేతనయితే మీ అమ్మ రంకుమొగుణ్ణి కొట్టు" అని తనవైపు ఈసడింపుగా చూస్తూ వాళ్ళ పిల్లల్ని ఇళ్ళల్లోకి తీసుకువెళ్ళిపోయారు.

తను ఆ తెల్లవార్లు యేడుస్తూండి పోయాడు. తెల తెలవారుతుండగా ఆటోలో వాళ్ళిద్దరూ వచ్చారు. ముసలాడు తన నురిమినట్లు చూస్తూంటే తల్లి తాళం తీసి-

"ఇంకా బయటెందుకు లోపలికి వచ్చి యేడు" అన్నా తనకు లోపలికెళ్ళా లన్పించలేదు.

తరువాతెప్పుడో లోపలికి వెళ్ళేసరికి ముసలాడు తల్లి ప్రక్కనే పడుకుని యేవిటో అంటూన్నాడు. ఇదివరకు తండ్రి అలా చెయ్యటం వొకటి రెండు సార్లు తన కళ్ళ బడింది కానీ అప్పుడెందుకో తనకేమనిపించలేదు. ఈ ముసలాణ్ణి చూస్తుంటే తల్లిని స్వంతం చేసుకుంటా డనిపించి కోపం ముంచుకొచ్చి ధడాల్న మంచం మీ్మదకు దూకి "రాత్రంతా మా అమ్మనెక్కడికి తీసుకెళ్ళావో చెప్పు లేకపోతే చంపేస్తాను," అంటూ వాడి గుండెల మీద తన్నసాగాడు. అనుకోని సంఘటనకు బిత్తరపోయిన వాళ్ళు కాసేపటికి తేరు కున్నారు.

"వెధవా యేవిటాపని, పెద్ద చిన్న లేకుండా ఆయన్ని కొడ్తావుట్రా?" తల్లి తనని లాగి చెంప మీద కొట్టేసరికి తనకి చెప్పలేని కసి పుట్టుకొచ్చి -

"ఏం, నాన్నని నువ్వు తిట్టి పొమ్మనలేదూ, ఈ ముసలాణ్ణి వుంచు కున్నావటగా, నీకు రంకు మొగుడంటగా, అందుకే నాన్నని వెళ్ళగొట్టేశావుటగా..... నాన్నకంటే వీడు బాగున్నాడా....? ముసలి తొక్కు, వెధవ బోడిగుండు కాకి రంగు వీడూనూ ముందు వీణ్ణి బయటకు పంపెయ్" విసురుగా అన్నాడు తను.

"ఇంకా చూస్తావెందుకు నాలుగు తన్ని తగిలించక, ఇంతున్నాడో లేదో వీడికింత పొగరా నాసొమ్ము తింటూ నన్నే కొడ్తాడా - ? రెండు రోజులు తిండి పెట్టకుండా మాడిస్తే నోరు మూసుకుని పడుంటాడు." ముసలాడు గుర్రుగా అంటూంటే తల్లి,

"ఆయన్ని పట్టుకునంత మాటంటావురా వీపు చీరేస్తాను ఫో ఇక్క డ్నుంచీ...." విసురుగా తనరెక్క పుచ్చుకుని బర బరా లాక్కువెళ్ళి బయటకు తోసి తలుపు వేసుకుంది. తనకు దుఃఖం ముంచు కొచ్చింది.

ఈ ముసలాడొచ్చాక తల్లి మారిపోయింది. తండ్రిని బయటకు



### 13 భాషల్లో డబ్బింగ్ చెప్పే 12 ఏళ్ల పాప!

ఈ అమ్మాయి పేరు రుచి. బొంబాయిలో చదువుకుంటోంది. వయసు 12 సంవత్సరాలు. రకరకాల గొంతుల్ని అనుకరించి మాట్లాడే కళలో ఈమె చిన్నతనం నుంచీ ఆరిందా. ఈ అమ్మాయిలోని ఈ నైపుణ్యం సినిమా పరిశ్రమని ఆకర్షించింది. నటించటానికి కాదు, డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా ఈమెని ఉపయోగించుకుంది చిత్ర పరిశ్రమ. కొందరు నటీ నటులు తమ డబ్బింగ్ తామే చెప్పుకోవటం లేదు. అలాంటివారికి రుచి డబ్బింగ్ చెప్తున్నది. ఇతర భాషలకి కూడా. ఇంతవరకు 13 భాషల్లో డబ్బింగ్ చెప్పింది. 4వ ఏటనుంచే అనుకరణతో మాట్లాడటం నేర్చుకుంది!

-బి.ఆర్. సుంకర

పొమ్మంది, తనను బయటకు నెట్టేసింది. ఒక్కరోజు కూడా తనకు ప్రేమగా అన్నం పెట్టలేదు. దగ్గరకు తీసుకుని ముద్దు పెట్టుకోలేదు. అక్కడే కూర్చుని తను వెక్కి వెక్కి యేడుస్తుంటే అక్కడికి వచ్చిన సూరమ్మ పిన్ని -

"ఒరే శీనూ మీ అమ్మ ఆ ముసలాయన తెచ్చే చీరలకు, నగలకు వాడివల్లో పడిపోయింది. ఇంక నీ ముఖం చూడదు. మీ నాన్న దగ్గరికి పో..." అంది.

"మా నాన్నిల్లెక్కడో తెలియదుగా" అన్నాడు తను.

"మీ నాన్న జండా చెట్టుకి యెదురుగా వున్న ఇంట్లో వున్నాడట వెళ్ళు" అంది.

తనకెంతో సంతోషమేసింది. నాన్నదగ్గరకు వెళ్తే తనని ప్రేమగా చూస్తాడనుకుంటూ పరుగు పెట్టి వెళ్ళి తలుపు తట్టాడు. ఎవరో ఒకామె వచ్చి తలుపు తీసి యెవరు కావాలంది.

"మా నాన్న వున్నాడా....?" అన్నాడు తను.

"అయనెవరు?" ఆమె అడుగుతూండగానే తండ్రి లోపల్నించి వస్తూనే రెండూ చేతులూ చాచాడు. బావురుమంటూ వెళ్ళి తండ్రిని చుట్టేశాడు, ఇద్దరూ చాలాసేపలా వున్నాక జరిగిందంతా పూస గుచ్చినట్లు చెప్పేశాడు.

"అయితే వీడు నీ కొడుకన్నమాట - నీకో కొడుకున్నట్లు నాతో ముందుగానే యెందుకు చెప్పలేదూ....." నిలదీస్తున్నట్లే అడిగిందామె.

"నువ్విష్టపడవేమోననీ" నసిగాడు తండ్రి.

"ఓహో..... అయితే ఇప్పుడు మాత్రం నాకెందుకిష్టమవుతుందీ, వాణ్ణేం నేను కన్నానా, నా కొడుకెలా అవుతాడు? వెళ్ళి పొమ్మను. మనకే నువ్వు సంపాదించుకొచ్చేది చాలటం లేదు," ఈసడింపుగా అంది.

"పోనీలే కాంతం యేదో నాలుగు రోజులుండి వెళ్తాడ్లే, ఈ మాత్రం దానికింత రాద్ధాంతం దేనికీ...." నాన్న అంటూంటే తన మనసు చిన్నబోయింది. అయితే నాన్నకూడా తనని పంపించేస్తాడా? ఈ ఇల్లు నాన్నది కాదా?

రాత్రి యెనిమిది దాటిపోయినా ఆమె తనకు అన్నం పెట్టలేదు. తొమ్మిది దాటాక తండ్రి వచ్చాడు. అప్పటి దాకా తను వాకిట్లో కూర్చుని వున్నాడు. తండ్రి తనని లోపలికి తీసుకువెళ్ళి తనకు అన్నం పెట్టి ఇంటి ముందు మట్టి జాగాలో తనకు పక్క యేర్పాటు చేస్తుంటే తనకేడుపొచ్చినంత పనయ్యింది. వాళ్ళిద్దరూ అన్నం తిని తలుపు వేసుకుని పడుకున్నారు.

నాన్న తనను దగ్గర పడుకో బెట్టుకుంటాడనీ, తండ్రిని వాటేసుకుని యెన్నో కబుర్లు చెప్పాలని యెంతగానో ఆశపడ్డాడు. తండ్రి తనని దూరం చేస్తున్నట్లనిపించింది. తండ్రికూడా మారి పోయాడు. తండ్రి కూడా ఈమెను వుంచుకున్నాడా.... ఆయనకూడా ఈమె వలలో పడిపోయాడేమో. నాన్న కూడా ఈమెకు నగలు, చీరలు తెస్తున్నాడు కాబోలు. అందుకే నాన్న నుంచుకుంది కాబోలు. తనను బయటకు నెట్టేస్తారేమో... ఇంతలో వాళ్ళ మాటలు వినపడ్డాయి.

"ఇదిగో నయ్యోయ్.... ఇప్పుడే సెప్తున్నా..... సాయంకాలంలోపు నీ కొడుకును పంపేశావా సరి లేకుంటే వాణ్ణి నేనే పొమ్మని సెప్తాను. వాడి తల్లికే వాడంటే పట్టలేదు నీ కెందుకయ్యా.....ఛీ... అది తల్లి కాదు కసాయిదా, ఏ ఆడదయినా మొగుణ్ణొదిలేసినా పిల్లల్నొదులుకోలేదు, నాకెందుకా గుది బండ" ఇంకా యేవో అంటోందామె.

"పోనీలే రెండు రోజులుండనీ ఆలోచిద్దాం" నాన్నగొంతు.

"తేరగా పందిలా తిన్నాడు వాడింకెక్కడికీ పోడు" అంటోందామె. మిగతా మాటలు చెవికెక్కలేదు. దోమలు ముసరటంతో నిద్ర రాలేదు.

నాన్న కూడా తననిపంపించేస్తే తనెక్కడికెళ్ళాలీ... మనసంతా ఆందోళనతో అల్లకల్లోలమయిపోయింది. తెల్లవార్లు నిద్రలేక వొళ్ళు వెచ్చబడింది తనకు. తెల్లవారాక తండ్రి నిద్రలేపుతుంటే కళ్ళు విప్పలేక విప్పాడు.

"ఇదిగో నువ్వు బయటకు వెళ్తే సాయంకాలానిగ్గానీ రావు వీడి సేవలెవరు చేస్తారు," అంటోందామె.

"శీనూ నువ్వు మీ అమ్మ దగ్గరకు వెళ్ళు నీకు జ్వరం తగ్గగానే నేనొచ్చి నిన్ను తీసుకువెళ్తానుగా.... ఏం వెళ్తావా?" అన్నాడు తండ్రి. తను దిగులుగా ఆయన వయిపు చూస్తుంటే ఆయనెటో చూస్తున్నట్లుండిపోయాడు. నీరసంగా వున్నా అలాగే లేచి నిల్చున్నాడు.

"ఒక్క నిముషం వుండరా శీనూ" కాఫీ తీసుకువచ్చి తనకివ్వబోయాడు. ఆయన ప్రేమతో ఇస్తున్నట్లనిపించక తీసుకోకుండా ముందుకు నడిచాడు, తండ్రి గభాల్న వచ్చి ఐదు రూపాయలు తన జేబులో పెట్టి వొదుల్చుకున్నాడు. తను వెళ్తూ, తండ్రి వెనక్కు చూడకుండా లోపలికి వెళ్ళిపోవటం స్పష్టంగా చూశాడు. ఆయన తనను వెనక్కి పిలవడని అర్థమయిపోయింది. నీరసంగా అడుగులు వేస్తూ పార్కుకు వెళ్ళి అక్కడ బెంచిమీద పడుకున్నాడు మూలుగుతూ....

మర్నాడు సాయంకాలం వెంకు తనను నిద్ర లేపేదాకా తనకు వొళ్ళు తెలియలేదు. అప్పటికి అతనెవరో తనకు తెలియదు. వెంకూనే తన విషయాలడిగితే తను చెప్పాడు. తనవైపు జాలిగా చూసిన వెంకు వెళ్ళి మందు బిళ్ళ, కాఫీ తీసుకువచ్చి ఇచ్చాడు.

మర్నాటికి కాస్త తేరుకున్నాడు. వెంకూనే తనకు బ్రతకటం నేర్పాడు..

రోజూ చెరో వయిపుకు వెళ్ళి వేరుశనక్కాయలు, బఠాణీలు స్కూళ్ళ దగ్గర, బస్టాండులో, రైల్వే స్టేషనులో, సినిమా హాళ్ళ దగ్గర అమ్ముకుని రాత్రయ్యేసరికిద్దరూ పార్కుకు చేరుకుని ఏదో వొకటి తిని కడుపు నింపుకుని కబుర్లు చెప్పుకుంటూ నిద్రపోయేవాళ్ళు.

ఏ పిల్లలు తల్లిదండ్రులతో వెళ్తున్నా తనకు గతమంతా గుర్తుకు వచ్చి మనసు కలత చెందుతుంది. తనుకూడా అలా స్కూలుకు వెళ్ళి చదువుకుంటే యెంత బాగుండేది.

తన ఈడు వాళ్ళంతా తల్లిదండ్రులతో షికార్లు కొడ్తూ నవ్వుతూ, తుళ్ళుతూ వెళ్తుంటే తను యెండలో మాడిపోతూ బఠాణీలమ్ముకుంటే గానీ కడుపులో ఆకలి చల్లారదు. తనకీబ్రతుకే రాసి పెట్టివుంది.

తనకిప్పుడు పన్నెండేళ్ళొచ్చినా తనకోసం ఇద్దరిలో యెవరూ రాలేదు. తనేమయిపోయాడోనని ఇద్దరికీ అనిపించదా -? ఒక్కసారయినా తను వాళ్ళకు గుర్తుకు రాలేదా? అమ్మా నాన్నా అంటే ఇంతేనా.... తల్లిదండ్రులు దైవంతో సమానమని స్కూల్లో మాస్టారు చెప్పారు. మరి వీళ్ళెందుకింత నిర్దయగా ప్రవర్తించారు? తనకంటే వాళ్ళకా వుంచుకున్న వాళ్ళే యెక్కువా? వాళ్ళకు తనేమీకాడా...?

అలా అనిపించగానే, తనిలా వొంటరివాడే ననుకుంటూంటే కళ్ళ వెంట నీళ్ళు జలజల రాలాయి. తనెంత యేడ్చినా వోదార్చే వారెవరు? దగ్గరకు తీసుకునే వారెవరు? దీనికి సమాధానమెవరు చెప్తారు?

కామంతో కళ్ళు మూసుకుపోయిన తల్లిదండ్రులు కన్న బిడ్డల్నే కాలదన్నుకున్నారని ఆ పసివాడి కర్థం కాలేదు. ✿

### వర్ధమాన నర్తకి రమణి



ఎనిమిది సంవత్సరాల ప్రాయంలోనే నృత్య రంగంలో ఎందరి దృష్టినో ఆకర్షించి గుర్తింపును తెచ్చుకుంటున్నది, హైద్రాబాదులోని బాదం సరోజాదేవి పబ్లిక్ స్కూలులో ఐదో క్లాసు చదువుతున్న రమణి.

ఇంత పిన్న వయసులోనే ఒక గంట ప్రదర్శనను నిర్విరామంగా ఇవ్వగలగటం రమణికున్న ప్రత్యేకార్హత! ఇప్పటికి ఇరవై ప్రదర్శనల దాకా ఇచ్చిన ఈ చిన్నారి, ఆంధ్ర బాలానంద సంఘం, జవహర్ బాలభవన్, నిర్వహించిన ఆంధ్ర నాట్యం, కూచిపూడి నృత్య పోటీలలో జూనియర్స్ విభాగంలో, వరుసంగా ప్రథమ ద్వితీయ బహుమతులు సాధించింది. రమణి గురువు శ్రీమతి ఉషామంజరి.

-చిల్లర భవానీదేవి